www.kalamjyothi.com


# కలంజ్యోతి

రేపటి కోసం

మంగళవారం

24 జూన్ 2025


## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




# ఒక్కచుక్కా వదులుకోబోం

## బనకచర్లపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయం

- గోదావరి వాటా తెలంగాణ హక్కు
- బీఆర్ఎస్ హయాంలోనే బనకచర్ల ప్రాజెక్ట్ కు పునాది
- త్వరలోనే సీఎల్పీ భేటీ.. ప్రాజెక్ట్ పై ప్రజెంటేషన్
- ఏపీతో చర్చించాలని నిర్ణయం
- నవంబర్ లోపు అన్ని కలెక్టరేట్ లలో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు
- క్రీడా పాలసీకి క్యాబినెట్ ఆమోదం
- రీజనల్ రింగ్ రోడ్డు సదరన్ పార్ట్ అలైన్ మెంట్‌కు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్
- 30లోపు కాళేశ్వరం కమిషన్‌కు గత బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రివర్గ మినిట్స్ నివేదిక
- నేడు రాష్ట్ర సచివాలయం ముందు 2వేల మందితో రైతు నేస్తం సభ
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** గోదావరి నదిపై ఏపీ అక్రమంగా నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్ట్ పై న్యాయపోరాటం చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది. గోదావరి నీటి వాటాలో ఒక్క చుక్కను కూడా వదులుకోబోమని స్పష్టం చేసింది. ఈ విషయంలో కృతనిశ్చయంతో ఉన్నట్లు తేల్చిచెప్పింది. వచ్చే నెల మొదటి వారంలో సీఎల్పీ భేటీ నిర్వహించి.. బనకచర్ల ప్రాజెక్ట్ అడ్డుకునేందుకు కేంద్రానికి ఏ విధంగా ఫిర్యాదు చేశామో ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. రెండు రాష్ట్రాలకు చెందిన సమస్యలను విభజన చట్టంలో ఉన్న అంశాలను హైలెవెల్ కమిటీ ముందు చర్చించాలని భావిస్తోంది. సోమవారం హైదరాబాద్ లోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకున్నది. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో మంత్రివర్గం కీలక అంశాలపై చర్చించి.. ఆమోదం తెలిపింది. క్యాబినెట్ భేటీ అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాబినెట్ సుదీర్ఘంగా

మిగతా 2లో

# భయపడే ప్రసక్తే లేదు

- బెదిరింపు కాల్స్ పై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు
- ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొడానికి సిద్ధమంటు స్పష్టం



5లో



6లో

# కంచ గచ్చిబౌలి కేసు విచారణ వాయిదా



## ఇందిరమ్మ ఇల్లు రాలేదని నిరసన..

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ఇల్లులేని నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం తాను దరఖాస్తు చేసుకున్నానని జాబితాలో తన పేరు వచ్చినా ఇల్లు ఇవ్వడం లేదంటూ యువకుడు రోడ్డుపై ధర్నా చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. చెన్నారావుపేట మండల పరిధిలోని చెరువు కొమ్ము తండాలో గ్రామ సభ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాకు చెందిన పేర్లను చదివి వినిపించారు. అర్హుల జాబితాలో తన పేరు ఉందని కావాలనే ఉద్దేశంతో గ్రామ ఇందిరమ్మ కమిటీ నాయకులు తనకు ఇల్లు ఇవ్వడం లేదంటూ బోడ సక్రు అనే యువకుడు ఆవేదనకు వ్యక్తం చేశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముం దు నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి ఇళ్ల జాబితాలో తన పేరు వచ్చేలా చూడాలంటూ నిరసన వ్యక్తం చేశాడు. వెం టనే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనకు హామీ ఇస్తేనే నిరసన నుండి తప్పుకుంటానని తేల్చి చెప్పాడు. విషయం తెలుసుకున్న స్థానికులు తన కు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూస్తామని తెలిపినప్పటికీ సక్రు నిరసన విరమించలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించ డంతో ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రాజేష్ రెడ్డి అదుపులోకి తీసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** హుస్నాబాద్-హన్మకొండ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగనాధపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సుదర్శన్ మృతి చెందాడు. ఎస్సై నుండ్రు సాయిబాబా తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శన్ వ్యక్తి గత పనుల నిమిత్తం రహదారిపై వెళ్తుండగా పక్కన కల్వర్టులో బైకు అదుపుతప్పి కాలువలో పడిపోయాడని తెలిపారు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని సాయిబాబా తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## పేకాటరాయుళ్ల అరెస్ట్

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని మల్లారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సాయి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రైడ్‌లో గూడెల్లి తిర్మల్ రెడ్డి, కలపర్తి రవీందర్, చిర్ర హనుమా రెడ్డి, గోపగాని సదానందం, భగవాన్ రెడ్డి అనే వ్యక్తులు - వీరంతా మల్లారం గ్రామ నివాసితులే - పేకాట ఆడుతూ పోలీసులకు దొరికారు. పోలీసులు వారి వద్ద నుండి రూ.5,250 నగదు మరియు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. ప్రజలు ఇలాంటి అసామాజిక కార్యకలాపాల నుండి దూరంగా ఉండాలని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

# ఒక్కచుక్కా వదులుకోబోం

▸▸ మొదటిపేజీ తరువాయి



జరిగిందన్నారు. బనకచర్లపై తెలంగాణ వాటాలో ఉన్న ఒక్క చుక్కా కూడా వదులుకోబోమని, ఎంతవరకైనా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బనకచర్లకు గత ప్రభుత్వంలో పునాది వేశారని, వారి తప్పును కప్పి పుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. జూలై మొదటి వారంలో బనకచర్లపై ప్రజాప్రతినిధులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ ను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తామన్నారు. ప్రాజెక్ట్ పై హైలెవల్ అధికారుల కమిటీ చర్చ చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్.. బనకచర్ల బంకను తమ ప్రభుత్వానికి రుద్దాలని చూస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ప్రజల్లో అసత్య ప్రచారానికి తెరలేపిందని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విచారణ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన సమాచారాన్ని ఈ నెల 30లోగా పీసీ ఘోష్ కమిషన్ కు అందజేస్తామని మంత్రి తెలిపారు. నాటి కేబినెట్ తో పాటు, సబ్ కమిటీకి సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ కు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని పొంగులేటి చెప్పారు. అలాగే క్రీడా పాలసీని కేబినెట్ ఆమోదించినట్లు మంత్రి వివరించారు. 2047 రైజింగ్ తెలంగాణ విజన్ కు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలకు రెండుసార్లు క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. వీటితో పాటు రీజనల్ రింగ్ రోడ్డు సదరన్ పార్ట్ అలైన్‌మెంట్ కి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు. చౌటుప్పల్ టు సంగారెడ్డి వరకు 201 కిలో మీటర్ల ఆర్ ఆర్ ఆర్ ను ఆమోదించామన్నారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్న మంత్రి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 16న సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీని విజయవంతంగా పూర్తి చేశామని మంత్రి వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ. 9 వేల కోట్ల రైతు భరోసా చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయం దండగ కాదు పండగ అని మరోసారి నిరూపించామని పొంగులేటి వివరించారు. రాష్ట్ర రైతుల పక్షాన సీఎం, డిప్యూటీ సీఎంకు రాష్ట్ర మంత్రివర్గం శుభాకాంక్షలు తెలిపిందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్ర సచివాలయం ముందు 2వేల మంది రైతులతో 'రైతు నేస్తం' పేరిట రైతు సంబురాలు జరపాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పదేండ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని విస్మరించిందన్నారు. తమ పాలనలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ లలో నవంబర్ లోపు తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

# పల్లెలలో ఇందిరమ్మ ఇంటి సంబురాలు

## హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


**కలంజ్యోతి, చెన్నారావుపేట :** పేదోడి ఇంటి కలని ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందని పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల పండుగ సంబరాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదోడి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ లబ్ధిదారులు బాదావత్ అనూష, షేక్ కయాజ్ కు చెందిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులకు ముగ్గుపోసి భూమి పూజలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేదవాడికి అందించాలనే సంకల్పంతో ఉందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ సంక్షేమ ఫలాలు అందుతాయని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న నాయక్, భూక్య సురేష్, బాదావత్ పెద్ద, పెద్దమ్మల రాజేందర్, ముత్యం భద్రయ్య, లావుడ్యా వెంకన్న, బాదావత్ చందర్, మాలోత్ బీమా, భూక్య రాజేందర్, బోనగిరి నర్సయ్య, ఆకుల అశోక్, బాదావత్ బాలునాయక్, తేజవత్ భద్రునాయక్, ఇస్లావత్ ఈర్యానాయక్, వీరునాయక్, తేజవత్ శివ, కరెడ్ల శివ, భూక్య ఊష్లూ, ఒంటరి అశోక్, బాదావత్ సురేష్, స్వామి, మూడు రాజు, సంతోష్, నాయిని రమేష్, రాజేందర్, రవినాయక్, బాలస్వామి, త్రినేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కలంజ్యోతి 3
మంగళవారం 24.06.2025 General News

# చెన్నారావుపేట మండలం
# అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌దే

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మరాయిపహాడ్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడారు. చెన్నారావుపేట మండలంలోని ప్రతి తండా, గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో పనిచేసినట్లు తెలిపారు. గెలిచిన ఎమ్మెల్యే తన సొంత మండలానికి 18 నెలల కాలంలో ప్రత్యేకంగా ఎన్ని నిధులు తెచ్చాడో ప్రెస్ మీట్ ద్వారా ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. మండలంలోని పది తండాలకు బీటీ రోడ్లను రూ.9 కోట్లతో మంజూరు చేస్తే నేడు వాటన్నింటినీ రద్దు చేసిన ఘనత గెలిచిన ఎమ్మెల్యేదేనని ఎద్దేవా చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు రాజకీయాల కోసం ఓట్ల కోసం ప్రజలను వాడుకుంటున్నారన్నారు. తాను ఓటమి చెందినప్పుడు బాధపడలేదు కానీ ఇప్పుడు అభివృద్ధి నిలిచిపోయినందుకు బాధపడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి ఇరిగేషన్, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ల ద్వారా ప్రత్యేక జీవో నంబర్ 396, 20 ద్వారా బ్రిడ్జిల నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. నాడు అసాధ్యం అనుకున్న బ్రిడ్జి నిర్మాణాన్ని మొండి పట్టుదలతో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా ఇంటర్ స్టేట్ పర్మిషన్ తీసుకొని హైడ్రాలిక్ క్లియరెన్స్‌తోపాటు అన్ని అనుమతులను తీసుకువచ్చానన్నారు. రెండు మండలాలను అనుసంధానం చేస్తూ మూడు వారదుల నిర్మాణానికి పూర్తిస్థాయి అనుమతులు తీసుకువచ్చినా.. 18 నెలలు గడిచినా కూడా బ్రిడ్జిల్లా పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చినా ఆరు గ్యారెంటీలు 420 హామీల పైన ప్రజలు నిలదీయాలన్నారు. బీఆర్ ఎస్ హయంలో గ్రామాలలో, తండాలలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. రైతు భరోసాను ఎన్నికల భరోసాగా మార్చి, సంక్షేమ పథకాల పేరుతో ఎన్నికల్లో లబ్ది పొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారన్నారు. చెన్నారావుపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పనిచేస్తున్నారని వారందరినీ పెద్ది అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, మండల పార్టీ నాయకులు, క్లస్టర్ బాధ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా, యువజన సంఘాల బాధ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ సేవలు మరువలేనివి

### మాజీ మంత్రి హరీష్ రావు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజక వర్గంలోని జక్కపల్లి గ్రామంలో సోమవారం కీర్తిశేషులు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ విగ్రహాన్ని మాజీ మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ గా శ్రీనివాస్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేని అని ఆయన అన్నారు. ఈరోజు ఆయన మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం హరీష్ రావు చిప్పల్ తుర్తిలో గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దే అధికారం ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





## డ్రగ్స్ కు అలవాటు పడొద్దు

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ప్రభుత్వ కళాశాలలో సోమవారం పోలీసులు యాంటీ డ్రగ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. సీఐ నీలం రవి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ కుమార్, కాలేజీ ప్రిన్సిపల్ శివరామకృష్ణ, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.




## సైబర్ నేరాలపై అవగాహన

**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద సోమవారము ప్రజలకు, ఆటో డ్రైవర్లకు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు, ఆటో డ్రైవర్ల తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. కేవైసీ అప్డేట్ చేయాలని వచ్చే మెసేజ్లకు ఫోన్ కాల్స్ లకు సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, వెంటనే 100 కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్యాల పోలీసులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మోకిడి వరుణ్ కుమార్ భార్య శ్రావణి ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఘటన కలకలం రేపింది. శ్రావణికి వరుణ్ కుమార్ 2016 సంవత్సరంలో వివాహం జరిగింది. ఆమె ముల్కలగూడెం, ఐనవోలు మండలానికి చెందిన గారంపల్లి చందర్ రావు కుమార్తె. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా కుటుంబంలో మనస్పర్థలు నెలకొన్నాయి. వీటి కారణంగానే ఆమె ఇంటి నుండి వెళ్లిపోయి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై గారంపల్లి చందర్ రావు ములుకనూరు ఎస్ఐ సాయిబాబును సంప్రదించి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసు శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏమైనా సమాచారం ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగలరని కోరారు.



## ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

### మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** పేదోడి కలని నేడు ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందని పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల పండుగ సంబరాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదోడి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలోని ఝల్లి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు అంబాల స్వరూప దామోదర్ సోమవారం ఇందిరమ్మ గృహ నిర్మాణ ముగ్గు పోసి భూమి పూజలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేద వాడికి అందించాలనే సంకల్పంతో ఉందని వారు అన్నారు. గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ నాయకులు, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, గ్రామ అధ్యక్షుడు బాదావత్ బాలునాయక్, సొసైటీ డైరెక్టర్ దొంతరబోయినా కొమ్మలు, అంబాల రవి, జక్క వెంకన్న, జరుపుల ప్రవీణ్, జక్క రవి, మేర్గు బాబు, సురేష్, దేశెట్టి రాకేష్, రఫీ, అతహర్, మెండే విజేందర్, ఇందిరమ్మ లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.



## పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించాలి

### బీఆర్ఎస్ మండల కార్యదర్శి లావుద్య పూర్ణ

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండా గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి లావుద్య పూర్ణ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యల పై రేగళ్ల పెద్దతండా పంచాయతీ సెక్రెటరీ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం లావుద్య పూర్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ పంచాయతీలో పారిశుద్ధ్యం బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ చేయాలని ఇండ్లలోని చెత్తను ప్రతిరోజు సేకరించి డంపు యార్డుకు తరలించాలని దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా సాగర్, లావుద్య శ్రీహరి, రమేష్, అరుణ్, గూగులోత్ వీరన్న, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రెస్ క్లబ్ ప్రారంభం

### ప్రారంభించనున్న ఎమ్మెల్యే సత్యం

**కలంజ్యోతి, మల్యాల :** కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించనున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మల్యాల మండల కేంద్రానికి చెందిన మహిళ సంఘ సభ్యురాలి ప్రమాద బీమా చెక్కులు వారి కుటుంబ సభ్యులకు అందజేసే కార్యక్రమంలో పాల్గొనున్నట్లు అధికారులు, పార్టీశ్రేణులు తెలిపారు.





# ఘనంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు
- విజయవంతమైన రక్తదాన శిబిరం
- అనాధలతో సహపంక్తి భోజనం



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ సరిత దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా యువకులు, కార్యకర్తలు భారీగా రక్తదానం చేశారు. నియోజకవర్గం నుండి తరలివచ్చిన వేలాదిమంది ఎమ్మెల్యేకు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు, కేక్‌లు తినిపించారు. పలువురు అధికారులు, వ్యాపార, వర్తక సంఘాలు, యువజన సంఘాల నాయకులు, జర్నలిస్టులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్ బర్త్ డే విషెస్ చెప్పారు. ఇక తండ్రి, ఎంఎల్సీ దామోదర్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రాహ్మణ వేద పండితులు ఆశీర్వచనాలు ఇచ్చారు.

**అనాధలతో కలిసి..**

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తన జన్మదిన వేడుకలను కొల్లాపూర్ చౌరస్తాలోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిరంలోని అనాధ శరణాలయంలో విద్యార్థులతో కలిసి జరుపుకొన్నారు. అనాధలకు అన్నం వడ్డించి తానూ వారితో కలిసి భోజనం చేశారు. భారీగా వచ్చిన వేలాది మందికి సాయి గార్డెన్స్ లో భోజనాలు ఏర్పాటు చేశారు.

**ప్రజాసేవకు జీవితం అంకితం : ఎమ్మెల్యే**

నా జీవితం ఇక ప్రజా సేవకే అంకితమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ గా ఉండి చేసిన సేవకంటే రాజకీయంలో ప్రజలకు చేస్తున్న సేవ ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. మా నాన్న, ఎంఎల్సీ దామోదర్ రెడ్డిగారి అడుగుజాడల్లో చివరి శ్వాఅ వరకు రాజీయాల్లో ప్రజా సేవకు అంకితం అవుతానన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, అండదండలతో ముందుకు సాగుతా అన్నారు. రాబోయే కాలంలో నాగర్‌కర్నూల్ ను విద్యా, వైద్యపరంగా అభివృద్ధి చేపడతానని, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల, మార్కండేయ పథకం పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు.

పార్టీ కార్యకర్తలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానన్నారు. కలిసి కట్టుగా ఉండాలని, ఏ సమయంలో ఏ కష్టమొచ్చినా నేను అండగా ఉంటానని, ప్రజాసేవలో ఇప్పటి వరకు అందించిన సహకారం ఇకముందూ అందించాలని కోరారు.





# శ్రీనగర్‌లో గిరిజన చట్టాలకు రక్షణ కరువు!

**నిబంధనలును అతిక్రమించి అక్రమ నిర్మాణాలు**

**ఏజెన్సీ ప్రాంతంలో భారీ అక్రమ కట్టడాలు**

**నోటీసులకే పరిమితం చర్యలు మాత్రం శూన్యం**



**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయతీ పరిధిలో ఏదైనా ఒక ఇల్లు నిర్మించాలంటే ఎన్నో అనుమతులు ఉండాలి. అలాంటివన్నీ పేద ప్రజలకు మాత్రమే. అదే బడా బాబులు బహుళ అంతస్తులు నిర్మించాలంటే రూల్స్ పెద్దగా పాటించనక్కర్లేదు. అదెక్కడంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్ నగర్ లోని శ్రీ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో.. అవును అది అక్కడ సాధ్యమే.. గ్రామ పంచాయితీ అధికారుల చేతులు తడిపితే చాలు ఎంతటి భారీ భవనాలు అయిన దగ్గరుండి కట్టిస్తున్నారని స్థానిక ప్రజలు నుంచి విమర్శలొస్తున్నా. అయినా అవేవీ పట్టించుకోకుండా గిరిజనేతరులకే గ్రామ పంచాయితీ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. శ్రీనగర్ గ్రామపంచాయతీపై అనేక ఆరోపణలు వస్తున్నప్పటికీ పంచాయితీ అధికారులు ఆ బిల్డింగ్ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. గిరిజన ప్రాంతాలలో బలమైన చట్టాలు ఉన్నప్పటికీ 1/70,1/59, పీసా చట్టాలను లెక్కచేయకుండా ఇష్టానుసారంగా బహుళ అంతస్తులు కమర్షియల్ భవనాలు లిఫ్ట్ తో కూడుకున్న భారీ భవనాలను గిరిజనేతరులు పోటాపోటీగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ఆస్తులను, భూములను పరిరక్షించడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. కానీ ఆ చట్టాలను ఉల్లంఘిస్తూ కొందరు గిరిజనుల భూములను కాజేస్తున్నారు. ప్రధానంగా గిరిజనుల హక్కులను రక్షించడానికి ఏజన్సీ ప్రాంతంలో 1/70, 1/59, పీసా యాక్ట్ ఉన్నాయి. ఏజన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు భూములు కోనుగోలు చేయొద్దు. కొనుగోలు చేసినా ఆ భూములపై హక్కులు లభించవు. గిరిజన ప్రాంతాలలో ఏ పని చేయాలన్నా గ్రామపంచాయతీలో తీర్మానం తప్పనిసరి పొందాలి. పంచాయితీ గ్రామసభ తీర్మానాలు లేకుండా ఎటువంటి పనులు చేయొద్దనే నియమ నిబంధనలు ఉన్నప్పటికీ గిరిజన చట్టాలను అమలు పరచడం లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నిత్యం గ్రామ పంచాయతీలో ప్రతిరోజు పర్యటిస్తున్నప్పటికీ గ్రామపంచాయతీ కార్యదర్శి ఆ భారీ భవనం కనపడకపోవడం పైన పలు అనుమానాలను దారితీస్తుంది. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి ఏ రకంగా చర్యలు తీసుకుంటారు చూడాలి మరి.



## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయ ఆవరణలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. పాల్వంచకు చెందిన మడిపల్లి నందిని అశోక్ తాను మూగా చెవులు కూడా వినపడవు అని తాను పదో తరగతి వరకు చదువుకున్నానని నిరుపేద అయిన తనకు సొంత ఇల్లు లేదని కుటుంబ పోషణ కోసం ఏదైనా ప్రభుత్వ ఆఫీసులో చిన్నపాటి ఉద్యోగం కల్పించగలరని దరఖాస్తు చేసుకున్నరు దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనా అధికారికి ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం రంగాపురం గ్రామానికి చెందిన బానోత్ ఉపేందర్ నిరుపేద కుటుంబమని తమ కుమారుడికి గురుకులంలో సీటు కోసం టీజి సెట్ పరీక్ష రాయాలని తెలియదని తమకు దగ్గరలో ఉన్న భద్రాచలం బీసీ గురుకుల వసతి గృహంలో ఆరో తరగతి అడ్మిషన్ ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారికి ఎండార్స్ చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భయపడే ప్రసక్తే లేదు

**బీజేపీ ఎంపీ రఘునందన్ రావు**

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తనను చంపుతానంటూ వస్తోన్న బెదిరిస్తూ వస్తున్న ఫోన్ కాల్స్ తో భయపడే ప్రసక్తే లేదని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. తానే కాదు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ కు ఆందోళనకు గురికాబోమని తేల్చి చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనను చంపేస్తామంటూ మధ్యప్రదేశ్ మావోయిస్టుల పేరుతో వచ్చిన ఫోన్ కాల్ నేపథ్యంలో సోమవారం ఆయన ఓ వీడియోను రిలీజ్ చేశారు. మధ్యప్రదేశ్ పీపుల్స్ వార్ మావోయిస్టు పేరుతో తనకు బెదిరింపు కాల్ వచ్చిందని అన్నారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడెంలోని ఓ పాఠశాల కార్యక్రమంలో ఉండగా +912143352974 నంబర్ నుంచి తనకు ఫోన్ చేసి ఇప్పుడే మధ్యప్రదేశ్ నుంచి మావోయిస్టు పార్టీ దళం బయలుదేరిందనీ సోమవారం అర్ధరాత్రి లోపు నన్ను చంపేస్తామని హెచ్చరించారని చెప్పారు. సోమవారం అర్ధరాత్రి వరకే డెడ్ లైన్ అని జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తూ రెండోసారి కూడా ఫోన్ చేశారన్నారు. ఆపరేషన్ కగార్ ను ఆపేందుకు మావోయిస్టు పార్టీ ఏదైనా సెన్సేషన్ కోసం ప్రయత్నిస్తోందా? తెలియడం లేదన్నారు. ఈ క్రమంలో ఎవరిని బలితీసుకోబోతున్నారో అనేది తాము ఆందోళన చెందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా బెదిరింపు కాల్‌తో అప్రమత్తమైన ఎంపీ రఘునందన్ రావు వెంటనే రాష్ట్ర డీజీపీ జితేందర్ , మెదక్ ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ రఘునందన్ ఫిర్యాదుతో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# గాంధీభవన్‌లో గొర్రెలతో నిరసన

### మంత్రివర్గంలో యాదవ నేతలకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ క్యాబినెట్, పీసీసీ కార్యవర్గంలో కురుమ, యాదవ సామాజిక వర్గాలకు స్థానం కల్పించాలని కోరుతూ గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం వినూత్న నిరసన చేపట్టింది. గొర్రెల కాపరులు లారీలో గొర్రెలు, మేకలతో గాంధీభవన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఎన్నికల్లో యాదవులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పాటు, పీసీసీ కార్యవర్గంలో యాదవ్‌లకు ప్రాధాన్యత తగ్గిందని, మంత్రివర్గంలో యాదవ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇది గమనించిన పోలీసులు వారిని అడ్డుకొని గొర్రెలను గాంధీ భవన్‌లోకి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, గొల్ల కురుమల నేతల మధ్య స్వల్ప వాగ్వాదం నెలకొంది. అనంతరం గొల్ల కురుమల సంక్షేమ సంఘం నాయకులు గాంధీ భవన్ వెలుపల నిరసన వ్యక్తం చేశారు. సంక్షేమ సంఘం నేత శ్రీహరి యాదవ్ ఆధ్వర్యంలో ఈ నిరసన వ్యక్తం చేశారు.

# 'రైతు భరోసా'సభను విజయవంతం చేయాలి

### మంత్రి తుమ్మల దిశానిర్దేశం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** సచివాలయం ముందు ఉన్న రాజీవ్ విగ్రహం ఆవరణ ప్రాంగణంలో నేడు సాయంత్రం నిర్వహించనున్న రైతు భరోసా విజయోత్సవం సభను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సభ నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా ఈ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు పాల్గొంటారని చెప్పారు. దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రైతులకు రూ.70వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు చెల్లించామన్నారు. ఈ సభకు అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్ధిదారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సీవీ ఆ నంద్, అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్స్) ఎంఎం భగవ త్, రవాణా శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, విద్యుత్ శాఖ ఎండీ ముష్రాఫ్ అలీ ఫారుక్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి,వ్యవసాయ,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఘనంగా భూక్యా సంజీవ్‌నాయక్

# జన్మదిన వేడుకలు

### ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహణ సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ హుస్సేన్ నాయక్



**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గం సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ జన్మదిన వేడుకలను సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ హుస్సేన్ నాయక్ ఆధ్వర్యంలో భూక్యా సంజీవ్ నాయక్ జన్మదిన వేడుకలను అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున యువకులు నాయకులు అభిమానులు అన్ని నియోజక వర్గాలలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా బానోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యను పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తున్నారని భూక్యా సంజీవ్ నాయక్ చూపించే ప్రేమ ఆప్యాయత ఎనలేదని కొనియాడారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక సభ్యులు లకావత్ స్వరాజ్ నాయక్, టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్, బానోత్ కిషన్ నాయక్, టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు భూక్య మోహన్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సభావత్ బాలకృష్ణ చౌహాన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య బాబులాల్ నాయక్, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు ఫుల్ సింగ్ నాయక్, ఉద్యోగ సంఘం జిల్లా నాయకులు గుగులోతు చందర్ నాయక్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు కృష్ణా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి వీరభద్రునాయక్, పాల్వంచ మండల ప్రధాన కార్యదర్శి కొర్ర బాబురావు చౌహాన్, ఆళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి సునావత్ రామకృష్ణ నాయక్, ధర్మజాగరణ సేన జిల్లా నాయకులు గణేష్ మహరాజ్, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లచ్చు నాయక్, రాష్ట్ర నాయకులు కృష్ణానాయక్, జిల్లా నాయకులు బట్టు హుస్సేన్ నాయక్, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు వినోద్ నాయక్, రాంబాబు నాయక్, దేవ్ సింగ్ నాయక్, సేవ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.







# కంచ గచ్చిబౌలి కేసు విచారణ వాయిదా

### కేసు సుప్రీంకోర్టులో ఉన్న నేపథ్యంలో హైకోర్టు నిర్ణయం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** మూడు నెలల క్రితం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ కేసుకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్న నేపథ్యంలో తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ హైకోర్టు సీజే ధర్మాసనం సోమవారం నిర్ణయం తీసుకుంది. కాగా కంచ గచ్చిబౌలి భూములను రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీకి అప్పగించడంతో పాటు ఆ భూమిని అభివృద్ధి చేసి ఐటీ కంపెనీలకు కేటాయించేలా టీజీఐఐసీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఆ భూములను జేసీబీలతో చదును చేయడంతో ఈ చర్యను అడ్డుకోవాలని హైకోర్టులో వేర్వేరుగా నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై వాదనల సందర్భంగా టీజీఐఐసీకి భూమిని అప్పగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు హైకోర్టును కోరారు.

Cinema
కలంజ్యోతి
మంగళవారం 24.06.2025




# సోనాక్షి సిన్హా షాకింగ్ కామెంట్స్!

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'స్పిరిట్'. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇందులో ప్రభాస్ మొట్టమొదటిసారి పోలీస్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమాలో హీరోయిన్‌గా ముందుగా దీపికాను సెలెక్ట్ చేసుకున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే స్టోరీ మొత్తం చెప్పిన తర్వాత వీరిద్దరి మధ్య వివాదం ఏర్పటినట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. పని గంటలు, అత్యధిక రెమ్యునరేషన్ ఇవ్వాలని దీపికా డిమాండ్ చేయడంతో కోసం వచ్చిన సందీప్ రెడ్డి వంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తొలగించారనే ప్రచారం కూడా జరుగుతోంది. అలాగే ఈ కథను ఆమెకు సంబంధించిన పీఆర్ టీమ్ లీక్ చేయాలని చూసినట్లు సందీప్ పెట్టిన పోస్ట్ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా షాకింగ్ కామెంట్స్ చేసింది. 'నేను దానికి పూర్తిగా అనుకూలంగా ఉన్నాను. నా సపోర్ట్ దీపికా పదుకొణెకు ఇస్తాను. నేను ఎనిమిది గంటలకు మించి పని చేయని హీరోలతో పనిచేశాను. అప్పుడే నాకు అనిపించింది. ఇండస్ట్రీలో స్త్రీలకు, పురుషులకు సమానంగా ఎందుకు ఉండదో అని. మహిళా నటులకు ఎందుకు భిన్నంగా ఉండాలో నాకు అర్థం కావడం లేదు. నేను 15 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. నాకంటే తక్కువ, నాకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఇతర నటులు ఉన్నారు. నువ్వు ఇచ్చిన టైమ్‌కు మించి షూటింగ్ చేయకూడదు. మీ కోసం కూడా మీరు సమయాన్ని ఉపయోగించుకోవాలి' అని చెప్పుకొచ్చింది.